ఆ రోజులు వెళ్ళిపోయాయి—

మరి నేడో?

బి. యస్. ఆర్. కృష్ణారావు

'రేపేగా ఒకటో తారీకు? జీతం వస్తుంది కదూ?' అన్న సీత మాటలు గోపాలానికి కొంచెం విసుగు కలగచేశాయి. ఆఫీసు కాయితాలు ఇంట్లోపడేసి, పగలల్లా పనిచేయటంనుంచి వేడెక్కిన బుఱ్ఱను చల్లబర్చటానికీ, మేనేజరు అన్న మాటలతో కుమిలిపోయే హృదయాన్ని శాంతింప చేయటానికీగాను కాస్త చల్లగాలి కోసం, అట్లా పార్కుకో, నది ఒడ్డుకో పోవాలని బయల్దేరాడు. ఈ స్థితిలో తనున్నప్పుడు సీత అలా అనేసరికి అతనికి మరింత చిరాకు కలిగింది.

'వస్తే వస్తుంది లేకపోతే లేదు. ఏమంత తొందర' అన్నాడు విసుగ్గా. ఒక్కరోజు జీతం రావటం ఆలస్యమయినందువల్ల కలిగే ఇబ్బందులు తెలిసినప్పటికీ జవాబుకోసం నిరీక్షించకుండానే గుమ్మం దాటిపోయాడు గోపాలం.

'ఏమీలేదు పాలడబ్బా అయిపోయింది. డబ్బాతుడిచి కడిగిపోస్తే ఇంకొక్కసారికి బొటాబొటీగా వస్తుంది. ప్రస్తుతం ఒక చిన్న డబ్బా అయినా పట్టుకొస్తారేమోనని' అంటూ పసిపిల్లవాడిని భుజాన వేసుకుని వంటింట్లోకి వెళ్ళిపోయింది.

మనస్సు సరిగా లేనప్పుడు మనోభావాలకు భిన్నంగా ఏ సంఘటనయినా జరిగితే నిరుత్సాహం కలుగకమానదు. ఒకమారు కలిగిందంటే, అది క్రమంగా దానినీడలో విస్తరించి ఇంక ఇతర విషయాలనుగురించి ఆలోచించకుండా చేయగల శక్తి దానికి ఉంది. అందులో డబ్బు లేకపోవడంవల్ల కలిగిన నిరుత్సాహం ఎంతటివారినయినా క్రుంగదీస్తుంది. అందలో ఏవస్తువు లేకపోయినా గడుపుకోవచ్చునుగాని పాలడబ్బా అంత చులకనగా అక్కర్లేదని తీసి పారెయ్యతగిన వస్తువు కాదని గోపాలానికి తెలుసు.

భుజాలు చిరిగిన చొక్కామీద కోటు తొడుక్కుని గుమ్మం దాటాడు. పాత బాకీ పాతిక రూపాయిలూ ఇవ్వనందువల్ల షావుకారు సరుకు సరిగా యివ్వటంలేదని తెలిసినప్పటికీ, పసిపిల్లవాడి విషయంకదా ఇవ్వకపోతాడా అనే నమ్మకంతో పెద్ద పెద్ద అంగలేస్తూ షావుకారు కొట్టుకు వెళ్ళాడు. గోపాలం కొట్టుకు వెళ్ళేసరికి షావుకారు లేడు. కుర్రాడున్నాడు. సగం దిగజారిపోయిన ప్రాణంతో గుండెలు కొట్టుకుంటూ వుంటే, వాడి నోటి వెంట జవాబేమి వస్తుందో అనే ఆదుర్దాతో కన్నార్పకుండా వాడికేసి చూస్తూ - నిరాశాభావంతో, తడబడే మాటలతో 'షావుకారు లేడా?' అన్నాడు.

'ఊళ్ళోకి వెళ్ళారు ఏమండి' అన్నాడు కుర్రాడు, గల్లా పెట్టెలోని చిల్లర డబ్బులు లెక్క జూసుకుంటూ. పాల డబ్బాలు బీరువాలో తళతళా మెరుస్తున్నాయి. గోపాలం నవనాడులూ క్రుంగిపోయాయి.

'ఇంకా ఎంతసేపటికి కొస్తాడు?'

'ఎప్పుడు పనైతే అప్పుడొస్తారు.'

'పాలడబ్బా ఒకటి ఇయ్యి, నాపద్దులో కర్చు రాసుకో' అన్నాడు వణుకుతున్న పెదవులతో.

'నాకు తెలీదండీ! నన్ను రొక్కం బేరమే చూడమన్నాడు. రేపు రండి, ఆయన ఉండగా' అని చింతపండు పెండె విరగ దియ్యటానికి వెళ్ళాడు.

'నాకు కాతావున్న సంగతి నీకూ తెలుసునుగా?' అన్నాడు ముఖంమీద చెమట తుడుచుకుంటూ.

'షావుకారొచ్చింతరువాత రండి, ఇన్ని మాటలు దేనికి' అని చింతకుండు పెండె బలవంతాన విరగదీసి కాటాలో వేశాడు.

పాతబాకీ పూర్తిగా ఇవ్వకపోవటంనుంచి షావుకారు కుర్రాడి కీవిధంగా చెప్పివుంటాడని గోపాలం గ్రహించాడు. ఇంక బ్రతిమాలినా లాభంలేదని బయటికొచ్చాడు. తన పర్సులో వున్న ఆఖరు అణన్నరా పెట్టి మధ్యాహ్నపు అరకప్పు కాఫీ త్రాగేశాడు. డబ్బా కడిగిపోస్తే ఒక్కసారికి వస్తుందేమో అన్న సీత మాటలు చెవుల్లో గింగురుమంటూ వుండగా నడి బజార్లోకొచ్చాడు, కోటు జేబుల్లో చేతులుపెట్టుకుని కాళ్ళీడ్చుకుంటూ. జీతం రేపు సాయంత్రంగాని రాదు. ఈ ఒక్కరోజూ గడిచేవిధం? పోనీ ఎవరినయినా అప్పడుగుదామంటే అందరికీ నెలాఖరు రోజే. ఎవర్నడిగితే ఎవరిస్తారు? ఈ పరిస్థితుల్లో పాలడబ్బా వచ్చేదెట్లా?

తల వంచుకుని వచ్చేస్తున్నాడు. ఎవరో వెనకాల వీపు తట్టినట్లయింది. ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాడు.

'ఏమోయ్ గోపాలం! అట్లా బెదురుతున్నావేం, నన్ను మర్చిపోయావా?'

'అరె, నువ్వా రామం, ఏదో పరధ్యానంగా వున్నాను. ఏమిటి కబుర్లూ, ఎక్కడా వుండటం?'

'ఫిలిం కంపెనీలో మేనేజరుగా వుంటున్నాను. కులాసా? పిల్లలా ఏమన్నా? అబ్బ, ఎన్నాళ్ళయిందోయ్ నిన్ను చూసి! కాలేజీలో చదువుతూన్న రోజుల్లో చేసిన అల్లరీ, ప్రిన్సిపాలు చివాట్లూ, మన పెంకె సమాధానాలూ-అన్నీ ఒక్కసారి జ్ఞాపకం వస్తున్నాయి. జీవితంలో మరపురాని దినాలు' అంటూ తృప్తిగా నవ్వాడు రామం.

మిత్రుడికి మరపురాని దినాలు కాలేజీ రోజులు. గోపాలానికి అన్నీ మరపురాని రోజులే. కాకినాడ కాలేజీరోజుల దగ్గరనుంచి, షావుకారు కుర్రాడు పాలడబ్బా అప్పివ్వనంటం వరకూ అన్నీ మరపురాని దినాలే.

'అయితే నీకన్న నేనే గొప్పవాడిని' అన్నాడు గోపాలం.

'ఏం అట్లా అంటున్నావ్' అని ఆత్రుతగా మిత్రుడు.

'నీకు కాలేజీరోజులు మరపు రావటం లేదు. నాకు ప్రతిరోజూ మరపురాని దినమే. అంటే జ్ఞాపకశక్తి ఎక్కువన్నమాట' అని నవ్వాడు గోపాలం.

'ఇంకా వెనకటిమాటలు పోలేదు, అసాధ్యుడివి. కాని నిన్ను తల్చుకున్నప్పుడల్లా ఆ రోజు సంఘటన గుర్తొస్తుంది. తనవైపు అదే పనిగా నువ్వు చూస్తున్నావని నిర్మల ప్రిన్సిపాల్‌తో రిపోర్టు చేసినప్పుడు, నేను నిర్మలవైపు అదేపనిగా చూస్తున్నానని ఆవిడకెట్లా తెలుస్తుంది-అదేపనిగా నిర్మల నావైపుచూస్తే తప్ప అన్నావు గుర్తుందా? ఆరోజులే వేరు. చీకూచింతా లేకుండా పెద్దవాళ్ళని పీడించి డబ్బులు వాడుక్కుని జల్సాగా కర్చుపెట్టుకునే రోజులు. ఇవి సంపాయించింది చాలకపోయే రోజులు.'

'అయితే ఇప్పుడు నీజీతమెంత' అని ఆత్రంగా అడిగాడు గోపాలం.

'అయిదు వందలు.'

ఈమాట వినేసరికి గోపాలానికి కొంచెం కోపం కలిగింది రామంమీద. డబ్భైఅయిదు రూపాయిలు సంపాయించుకునే తనకీ జీతం చాలకపోవటమే, అయిదువందలు సంపాదించే మిత్రుడికీ చాలకపోవటమే?

'నిల్చునేవున్నాం, కాస్త టిఫిన్ పుచ్చుకుందాం, రా' అని చెయ్యిపుచ్చుకు లాగాడు రామం. మనస్సు వెనక్కులాగుతున్నా కాళ్లు వాటంతవే ముందుకుపోయాయి. బాల్యమిత్రుడు కనబడిందే చాలుగదా అని సంతోషంతో అన్నీ ఆర్డరిస్తున్నాడు రామం. లడ్డూ విరిచి నోట్లో పెట్టుకుంటూంటే చెయ్యి వెనక్కిలాగింది గోపాలానికి.

'నువ్వొచ్చిన పనేమిటి, చేసేపనేమిటి! నీ పసిపాపకన్నా పాతికరెట్లు పెద్దవాడివి' అన్నది అంతరాత్మ.

'నీ సొంతడబ్బు పెట్టుకుని తినేయోగ్యత ఈ జన్మలో లేకపోగా ఆప్తమిత్రుడు పెట్టిందికూడా తృణీకరిస్తున్నావా' అన్నది జిహ్వ. నోరుతెరిచి లడ్డూముక్క నోట్లోవేసుకున్నాడు.

‘ఇంట్లో భార్యాబిడ్డలు ఆవిధంగావుంటే,నువ్వీ విధంగా పొట్ట నింపుకుంటున్నావా’ అన్నది అంతరాత్మ.

‘ముందు పెట్టింది తిను. తరువాత పాలడబ్బా సంగతి ఆలోచిద్దుగాని’ అన్నది జిహ్వ.

లడ్డూ, పెసరట్టూ, కారప్పూస ఒకదాని తరువాత మరొకటి నోటిలోకి వెళ్ళిపోయాయి.

‘ఒక పాలు, ఒక కాఫీ’ అన్నాడు మిత్రుడు.

పాలు అనగానే మనస్సు చివుక్కుమంది. కడుపులో చెయ్యిపెట్టి కలిపినట్లయింది. ‘పాలెవరికి?’ అన్నాడు.

‘నాకేనోయ్. కాఫీ తాగను. కాఫీకన్న పాలే ఇష్టం’ అన్నాడు మిత్రుడు నవ్వుతూ. పాలుతాగే పసిపాపకు పాలు కరువైనాయి. పాతికేళ్ళ పైబడ్డ వాళ్ళకు పాలు కావలసి వచ్చాయి. సృష్టిచిత్రం- అనుకున్నాడు గోపాలం. సెర్వరు కాఫీ, పాలు పట్టుకొచ్చాడు. పాల కప్పు గోపాలంముందు పెట్టాడు, కాఫీ కప్పు రామంముందు పెట్టాడు. పాలకప్పులో తన పసిపాప ప్రతిబింబం కనిపించింది: ఆకలితో ఏడుస్తున్నట్లూ, చేతులు నోట కుక్కుకుంటున్నట్లూ భార్య సీత. డబ్బా అంచులు కడిగి సరిపుచ్చి పోస్తున్నట్టు. ఒకటి ఆకటికి తట్టుకోలేక ఏడ్చే తన పసి పాపముఖం, రెండోది తన రాకకోసం ఎదురుచూసే భార్య సీత విచారవదనం: పాల కప్పులో కనబడ్డాయి. తనముందునుంచి పాల కప్పు లాగాడు మిత్రుడు. కాఫీకప్పు ముందుకు తోశాడు. కాఫీకప్పులో ఖాళీ పాలడబ్బా తళతళా మెరుస్తూ కనబడింది.

‘ఇంకా కాఫీ త్రాగలేదు, వేడిగా వుందా?’ అన్నాడు రామం.

‘ఆ. అవును’ అంటూ గ్లాసుఎత్తాడు కాఫీ తాగుదామని. చేతులు వణికాయి, కాఫీగ్లాసు జారి కిందబడి ముక్కలయిపోయింది. కాఫీ నేల పాలయింది. వేడికన్నీటిబిందువులు రెండు నేల పాలయిన కాఫీలోపడి కలసిపోయినయి.

‘ఆదేం? చెయ్యి జారిందా?’

‘అవును. తాగలేని పిల్లి బోర్లదోసుకుంది’ అన్నాడు గోపాలం.

కాలేజీనాటి ఎగతాళిమాటలే మాట్లాడుతున్నాడని అనుకున్నాడు రామం.



జేబురుమాలుతో కళ్ళొత్తుకున్నాడు గోపాలం.

‘అయితే మళ్ళీ కాఫీ తెప్పిస్తాను, తాగు’ అని బలవంతం చేశాడు.

గోపాలం వద్దని గట్టిగా చెప్పాడు. ఇద్దరూ బైటికొచ్చేశారు.

‘అయితే నీకు పిల్లలెంతమందోయ్’ అన్నాడు రామం, కిళ్ళీ అందిస్తూ.

‘మూడేళ్ళ ఆడపిల్ల, తొమ్మిదినెల్ల పిల్లాడూ.’

‘సంతోషం. నాకాభాగ్యం ఇంతవరకూ లేదు. పద మీ ఇంటికి పోదాం పద, పిల్లల్ని చూపింతుగాని.’

గోపాలం మనస్సు చివుక్కుమంది. కాఫీ హోటల్లో కడుపునిండా తిని, వొట్టిచేతులతో పాలడబ్బా లేకుండా పోవటమా అని. ఇంటికొచ్చిన స్నేహితుడిని భోజనానికి వుండమనకపోతే బాగుండదు. కాని వంటయింటి పరిస్థితులెట్లావున్నాయో !

ఖాళీ పాలడబ్బా కడిగి కొమ్ము చెంబులో పోస్తున్నది సీత. గోపాలంచేతులో ఏమీ లేక పోయేసరికి ఆమె నిర్ఘాంతపోయింది. పేదమల యొక్క వదనం చూచి కొంచం ఆశ్చర్యపడ్డా ప్రక్కనున్న మనిషిని చూడగానే గ్రహించి పిల్లవాడిని తీసుకుని లోపలికి వెళ్లిపోయింది.

స్నేహితుడిని చాపమీద కూర్చోమన్నాడు. తానూ కూర్చున్నాడు. లోపలికివెళ్ళి సీతతో అసలు విషయం చెపుదామని లోపలపీకుతున్నా వూరుకున్నాడు. లోపల పిల్లవాడి ఆకలి ఏడుపు వినబడుతున్నది.

'ఏరీ మీ పిల్లలు?' అన్నరామం ప్రశ్నతో లోపలికివెళ్ళి ఇద్దర్నీ తీసుకొచ్చాడు. మూడేళ్ళ ఆడపిల్ల బెదిరిచూస్తూన్నది. ఈ కొత్త మనిషి ఎవరా అని. నోట్లో వేళ్ళు కుక్కుకుంటూ కాళ్ళతో తన్నుకుంటున్నాడు పసివాడు.

'ఇద్దరూ కడిగిన ముత్యాల్లాగున్నారు. అదృష్టవంతుడివోయ్ గోపాలం' అని ఇద్దరి చేతుల్లో చెరి అయిదు రూపాయిలూ పెట్టాడు. 'ఎందుకోయ్ ఇదంతా' అని పిల్లల్ని ఇంట్లోకి తీసుకువెళ్ళాడు. లోపలికి వెళ్ళగానే సీతతో విషయంచెప్పి, పది రూపాయిలూ జేబులో వేసుకొని 'అతడిని భోజనానికి వుండమంటున్నా ఏమన్నా కావాలా?' అన్నాడు.

'నెయ్యీ. కూరగాయలూ కావాలి' అన్నది సీత'.

'సరే, నేతిగిన్నె, కూరలసంచీ ఇవ్వు' అన్నాడు.

'పాలడబ్బా తెచ్చారా?' అన్నది కన్నార్పకుండా.

'పీటితోపాటుగానే' అని నేతిగిన్నె, సంచీ తీసుకున్నాడు. 'ఇవాళ మాయింట్లో వుండాలి తప్పదు. అడ్డుచెప్పబోకు. అట్లా బజారుపోదాం పద' అన్నాడు గోపాలంతో.

'నువ్వు అనటమూ నేను కాదనటమూనా. కాని ఏదో తతంగంమీద బయల్దేరావు. నాతిండి సంగతి నీకు తెలుసుకదా! అందులో ఇప్పుడే కాఫీ హోటల్లో తిన్నామూ! కాస్తలఘువుగానే కానియ్యి సుమా!' అని నవ్వుతూ లేచాడు రామం. ఇద్దరూ రోడ్డుమీద పడ్డారు.

'ఇందాకటినుంచీ అడగటం మర్చిపోయాను. నువ్వేం చేస్తున్నావ్, గోపాలం?'

'ఆఫీసులో గుమాస్తా ఉద్యోగం' అన్నాడు గోపాలం.

పొగాకుపంట నిషేధించాలి

"శాస్త్రి"

మన ఆహారసమస్యాపరిష్కారానికిముఖ్యంగా చెయ్యవలసిన ప్రథమ చికిత్స — ప్రభుత్వం శ్రద్ధవహించి ప్రజల జీవనాధారమైన తిండి ధాన్యాలు మాత్రమే పండించుట కంగీకరించి విలాసార్థ ముపయోగించే పంటలు- పొగాకు వగైరా- నిషేధించుట. ఈ నిషేధంవల్ల ప్రభుత్వానికి ఆదాయంలో లోటుకలిగినాసరే ప్రజల శ్రేయస్సుకోసం ఆ లోటును భరించడం, మరొకలాగ భర్తీచేసుకోడం అవసరం. సేద్య యోగ్యమైనభూమిలోఅధమం 90%అయినా ధాన్యపు పంటకే ఉపయోగించేలా ప్రభుత్వం చూడాలి.

మనదేశంనుంచి 1941-'42 లో 220 లక్షల రూపాయిల విలువగల పొగాకు ఎగుమతి అయినట్లు, 1945-'46 లో 363 వేల ఎకరాలలో పొగాకు పండిస్తున్నట్టు ప్రభుత్వపు లెక్కలు చెపుతున్నాయి. ఈ నాలుగు మూడేళ్ల లోనూకూడా ఈపొగాకుపంట ఎన్నోరెట్లు పెరిగిపోయింది. దీనికికారణం వరిపంటకంటే రైతుకు పొగాకుపంటవల్ల అనేకరెట్లు లాభం వస్తోంది. ప్రజల శ్రేయస్సును విస్మరించి ప్రత్యేకవ్యక్తుల ఆదరాభిమానాలు పొందడానికి ప్రయత్నించడం నిజమైన ప్రజాప్రభుత్వ లక్షణం కాదు. గోదావరి, కృష్ణ లంకలలోనూ, గుంటూరు, కృష్ణా జిల్లాలలోనూ, డెల్టా భూములలోనూ ఇప్పుడు కొన్ని లక్షల ఎకరాల భూమిలో పొగాకు పండిస్తున్నారు. ఈభూమిలో (ఏది పండుతుందో అది) ఆహారధాన్యం పండించేలా ప్రభుత్వం చేస్తే ఈ ధాన్యపుకొరత కొంతవరకైనా తగ్గడానికి అవకాశం ఉంది.